క్లుప్తంగా

మంత్రిని సన్మానించిన ట్రస్మా నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రం లోని హౌసింగ్‌బోర్డు కాలనీ పర్యటనలో భాగంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఎస్ఆర్ యూపీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగాగా ట్రాస్మా నాయకులు మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానించారు. అధ్యక్షుడు ప్రభాకర్, అక్తర్ బేగం, కతియా, పరమేశ్వరీ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

మిడ్జిల్: మండలంలో ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం బీఆర్ఎస్ ద్వారానే సాధ్యం అయిందని ఎంపీపీ సుదర్శన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మట్లాడారు. టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి చేస్తున్న విమర్శలు సరికావని అన్నారు. గతంలో కాంగ్రెస్ చేసిందేమీ లేదన్నారు. నాయకులు బాల్‌రెడ్డి, జంగారెడ్డి, శ్రీనువాసులు ,జంగారెడ్డి, జైపాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, లక్ష్మన్, జగన్, గోపాల్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్

జడ్చర్ల: పట్టణ పరిధిలోని 44వ నంబర్ జాతీయరహదారిపై మంగళవారం ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. జాతీయ రహదారి మరమ్మతు పనులు కొనసాగిస్తున్న కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఒక వైపు పనులు సాగుతున్నందున వన్‌వేలోనే రాకపోకలు కొనసాగించారు. బూరెడ్డిపల్లి నుంచి మాచారం వరకు వన్‌వే కొనసాగింది. వాహనాలు నెమ్మదిగా కదిలాయి.

వార్డుల్లో పర్యటించిన చైర్‌పర్సన్

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటి పరిధిలోని పలు వార్డుల్లో మంగళవారం చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి, కమిషనర్ మహమూద్‌షేక్‌లు పర్యటించారు. 26వ వార్డులో మురికికాల్వ జాం కావటంతో వార్డు కౌన్సిలర్ ఆలూరు శశికిరణ్ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువెళ్లగా జెట్టింగ్ యంత్రం సహాయంతో చెత్తను తొలగింపజేశారు. అదేవిధంగా 17వ వార్డులోనూ కాల్వలను పరిశీలించారు. చెత్త పేరుకుపోకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. కౌన్సిలర్ చైతన్య ఉన్నారు.

ఆర్థికసాయం

అడ్డాకుల: కందూర్‌కి చెందిన గణేష్ అనారోగ్యంతో మృతిచెందడంతో బాధిత కుటుంబాన్ని మంగళవారం బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మున్నూర్ రమేష్ పరామర్శించారు. గణేష్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.5వేల నగదును బాధిత కుటుంబానికి అందజేశారు. ఉపసర్పంచ్ శంకర్, బుడ్డన్న, రాములు, రవి, మహేష్, శేఖర్ తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

దేవరకద్ర రూరల్: రాబోవు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం కౌకుంట్ల మండల తహసీల్దార్ బ్రహ్మం గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న నాలుగు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేపట్టవల్సిన పనులు గుర్తించారు. హెచ్‌ఎం అబ్దుల్ హక్, రెవన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మందులు పిచికారీ చేయాలి

హన్వాడ: మండలంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రైతులు కూరగాయల తోటల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని మండల హార్టీకల్చర్ అధికారి చంద్రశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నీటి నిల్వతో తోటలకు తెగులు సోకే ప్రమాదం పొంచి ఉందన్నారు. నివారణకు బ్లేటాక్స్ 2ఎంజీని లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

'ముస్లింలకు ఖాళీ తోఫా'

భూత్పూర్: రాష్ట్రంలో గవర్నర్ కోటా కింద ఖాళీగా ఉన్న ఎమ్మెల్సీ పదవులు ఇవ్వకుండా ఖాళీ తోఫా ఇచ్చారని టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సాధిక్ మంగళవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. సోమవారం నిర్వహించిన మంత్రి మండలి సమావేశంలో సీఎం ముస్లింలను విస్మరించారని అన్నారు.

ఆస్తులు కాపాడుకోవాలి

పాలమూరు: ప్రభుత్వ అధికారులు విధులు బాధ్యతతో నిర్వహించాలని బీజేపీ నేత పి.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్‌లో ఉన్న ఆర్టీసీ ఆస్తులను కూడా మాయం చేసే పరిస్థితి వస్తుందమోనని, కాపాడుకోవాల్సిన బాధ్యత సదరు సిబ్బందిపై ఉందని బీజేపీ తోడుగా ఉంటుందన్నారు. జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్.పీ వెంకటేష్, బాలరాజు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల అందజేత

మహబూబ్‌నగర్ క్రైం: టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో పరిధిలో పలు సందర్బాల్లో చోరీలకు గురైన సెల్‌ఫోన్‌లను పోలీసులు గుర్తించారు. సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం 12మంది బాధితులకు అందజేశారు. సీఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం0000 ఉపయోగించి వారంలోనే ఫోన్లు పట్టుకున్నామన్నారు.

హరితహారంపై ప్రత్యేకదృష్టి


గండేడ్‌లో మాట్లాడుతున్న ఏపీడీ శ్రీపాద్

గండేడ్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హరితహారంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని డీఆర్డీఓ ఏపీడీ శ్రీపాద్ అన్నారు. గండీడ్ ఎంపీడీఓ చాంబర్‌లో ఈజీఎస్ పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 286 లోకేషన్ల లక్ష్యం ఉన్నట్లు తెలిపారు. మరో 24 లోకేషన్ల ప్రతిపాదనలు వేయలేదని వెంటనే ఇవ్వాలన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతికి ఇంటికి హోం సీడ్ మొక్కలు ఇవ్వాలన్నారు. ఎంపీడీఓ రూపేందర్ రెడ్డి, ఏపీఓ హరిచంద్రుడు పాల్గొన్నారు.

ప్రతిగ్రామంలో ఈతవనం

నవాబుపేట: ప్రతిగ్రామంలో ఈతవనాలను అభివృద్ధి చేసేందుకు హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటుతున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ అరుణ తెలిపారు. లోకిరేవులో మంగళవారం ఈత మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. నాటిన ప్రతిమొక్కను సంరక్షించే బాధ్యత సంఘం సభ్యులు తీసుకోవాలని సూచించారు. సత్యనారాయణ గౌడ్, నరేందర్ గౌడ్ పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి

బాలానగర్: హరితహారంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎంపీడీఓ కృష్ణారావు అన్నారు. మంగళవారం బాలానగర్ మండల పరిధిలోని పెద్దాయపల్లి, గుండేడ్, నేరళ్లపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించడంతోపాటు హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను పరిశీలించారు. మొక్కలకు పాదులు, కంచె ఏర్పాటు చేయాలని సూచించారు. ఈజీఎస్ కూలీలతో పనులు చేయించాలని అన్నారు. ఆయన వెంట కార్యదర్శులు ఉన్నారు.


లోకిరేవులో మొక్కలు నాటుతున్న ఎస్ఐ అరుణ


బాలానగర్ మండల పరిధిలో పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణారావు

మండలానికి చేరిన క్రీడాసామగ్రి

నవాబుపేట: మండలంలో వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాల కోసం ప్రభుత్వం సామగ్రి అందించినట్లు ఎంపీడీఓ శ్రీలత, ఏపీఓ బద్రునాయక్ తెలిపారు. మండలంలోని 22 గ్రామాలకు సంబంధించిన సామగ్రిని త్వరలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేస్తారని అన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులు క్రీడా ప్రాంగణాలను సిద్ధం చేయాలని సూచించారు.


పంపిణీకి సిద్ధంగా క్రీడాసామగ్రి

ఈవీఎంలపై అవగాహన



భూత్పూర్: ఈవీఎంలపై తహసీల్దార్ చెన్నకిష్టన్న మంగళవారం తమ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాటి పనితీరు, ఓటింగ్ విధానం తదితర అంశాలను వివరించారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, కౌన్సలర్ శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు నారాయణ గౌడ్ ఉన్నారు.

ఎంపీ వ్యాఖ్యలపై నిరసన

జడ్చర్ల: ఎంపీ సోయం బాపురావు చేసిన వ్యాఖ్యలపై లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఎంపీ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ గోపాల్, శంకర్, గోవింద్, లోకేష్‌నాయక్ పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి



అడ్డాకుల: బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని నియోజకవర్గ నాయకుడు దేవరకద్ర బాలన్న అన్నారు. కొమిరెడ్డిపల్లిలో మంగళవారం ఆయన పర్యటించి మాట్లాడారు. బూత్‌స్థాయిలో పార్టీని పటిష్టం చేయాలని కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. ఈ సందర్భంగా 40 సంవత్సరాలకు పైగా పార్టీకి సేవలందిస్తున్న గోవర్ధన్‌రెడ్డిని అభినందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రవీందర్‌గౌడ్, బుచ్చన్నయాదవ్ తదితరులు ఉన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ పథకాలు


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

- ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి
- 139 మందికి సహాయ నిధి చెక్కుల పంపిణీ

దేవరకద్ర: తెలంగాణలోని ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం దేవరకద్రలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 139 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ. 40 లక్షల చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన విధానంతో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. పేదల వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయ నిధి ఎంతో ఉపయోగ పడుతోందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీలు రమాదేవి, గుంత మౌనిక, నాగార్జునరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, నాయకులు జట్టి నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, నరేందర్‌రెడ్డి, కొండ శ్రీనివాస్‌రెడ్డి, విశ్వేశ్వర్, బాల్‌రాజు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి సామాజిక తనిఖీ

నవాబుపేట: మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి పథకం కార్యక్రమంపై ఈ నెల 16 నుంచి సామాజిక తనిఖీ ఉంటుందని ఎపీఓ జ్యోతి తెలిపారు. మండల కేంద్రంలో ఉపాధిసిబ్బందితో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాలకు సంబంధించిన ఈజీఎస్ పని వివరాలు తదితర రికార్డులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. గత ఏడాది ఎప్రిల్ నుంచి 2023 మార్చి 31 వరకు సుమారు రూ. 3.77 కోట్ల విలువైన పనులు మండలంలో జరిగాయని వివరించారు. పూర్తి వివరాలతో తనిఖీకి సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు.

ఘనంగా ఆటోడ్రైవర్ల దినోత్సవం



స్టేషన్ మహబూబ్‌నగర్: ఐఎన్‌టీయూసీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ చౌరస్తాలో మంగళవారం ఆటోడ్రైవర్ల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాములుయాదవ్ మాట్లాడుతూ ప్రజలకు సేవలు అందించడంలో ఆటో డ్రైవర్లు ముందుంటారని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కూడా ఆటో డ్రైవర్లు పోరాడినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్ల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. డబుల్‌బెడ్ రూంలతోపాటు హెల్త్‌కార్డులు జారీ చేయాలని, సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులకు అమలు చేస్తున్న మాదిరిగా సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. నాయకులు బాబుమియా, గోపాల్, బాల్‌రాజు, ఆంజనేయులుగౌడ్, రవి, మోహన్, మల్లేష్, శేఖర్, గోపాల్, రమేశ్, నాగేష్, చెన్నయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

పరుసవేదీశ్వర ఆలయంలో పౌర్ణమి పూజలు

జడ్చర్ల టౌన్: అధికశ్రావణ మాసం పౌర్ణమి పురస్కరించుకుని మీనాంబరం పరుసవేదీశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. పట్టణంలోని రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయంలోనూ పౌర్ణమి పురస్కరించుకుని వ్రతాలు ఆచరించారు. పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం చేపట్టారు.

విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలి



అడ్డాకుల: విద్యార్థులు తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని మండల ఆయుర్వేద వైద్యురాలు లావణ్య సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, శాఖాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ఆయుష్‌శాఖ ద్వారా వర్షాకాలం హెల్త్ క్యాంపులను నిర్వహించారు. విద్యార్థులను పరీక్షించి అవసరమైన వారికి ఆయుర్వేద మందులను అందజేశారు. అదేవిధంగా విద్యార్థులకు పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. వర్షాకాలంలో పరిశుభ్రంగా లేకపోతే వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పకుండా పౌష్టికాహారం ఇవ్వాలని సూచించారు. అనంతరం ఆయుష్ కరదీపికలను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

పశువైద్యాధికారుల సలహాలు తీసుకోవాలి


మూసాపేటలో టీకాలు వేస్తున్న వైద్యులు


కోయిల్‌కొండలో

అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండల కేంద్రాల్లోని పశువైద్య కేంద్రాల్లో మంగళవారం పశువులు, గేదెలకు వైద్యాధికారులు రాజేష్‌ఖన్న, మధుసూదన్‌లు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. పాడి రైతులు తప్పకుండా టీకాలను వేయించాలని కోరారు. కార్యక్రమంలో పోల్కంపల్లి విండో అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, పశు వైద్య సిబ్బంది సుబ్బారెడ్డి, రామేశ్వరి, చంద్రమోహన్‌గౌడ్, సావిత్రి తదితరులు ఉన్నారు.

కోయిల్‌కొండ: మండలంలో రైతులు వైద్యాధికారుల సలహాలు తీసుకొని పశువులను వ్యాధుల నుంచి కాపాడుకోవాలని జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్ రెడ్డి అన్నారు. మంగళవారం పశువులకు టీకాలు వేసే కార్యక్రమం చేపట్టారు. పశువైద్యాధికారి రేవంత్, వైస్‌ఎంపీపీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్: మండల కేంద్రంలోని పశువైద్యశాలలో మంగళవారం పశువైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాలల్లో ఈ నెల 28వ తేదీ వరకు జరిగే గేదెలు, ఆవులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి డా.మధుసూదన్, ఎమ్మెల్యే వివరించారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, సీనియర్ నాయకులు నారాయణ గౌడ్, నర్సింహా గౌడ్, బాలస్వామి, విండో డైరక్టర్ రాములు, సురేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

పట్టా భూమిపై కావాలని వివాదం

బాలానగర్: పట్టాభూమిపై కొందరు వివాదాలు సృష్టిస్తున్నారని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలోని సర్వే నెం 118లో 1953–54 కు ముందు అప్పటి కలెక్టర్ గ్రామానికి చెందిన నర్సింలు, గంగోజీలకు 27.29 ఎకరాల భూమిని అసైన్డ్ చేశారన్నారు. కానీ రికార్డులలో పట్టాగా వివరాలు రాకపోవడంతో వారి వారసులు ఆర్డీఓ వద్ద 2016 సంవత్సరంలో అర్జీ పెట్టుకుని ఎన్‌ఓసీ పొందారని వివరించారు. అనంతరం ఆ భూమిని 2018లో ఇతరులకు అమ్ముకున్నారని తెలిపారు. అయితే పట్టాగా మారిన విషయం తెలియక అప్పట్లో సుమారు ఒక ఎకరా భూమిలో శ్మశానవాటిక నిర్మాణం చేపట్టారని అన్నారు. అయితే ప్రొహిబిటెడ్‌లో పడ్డ భూమి కోసం సదరు కొనుగోలుదారుడు తహసీల్దార్ కార్యాలయం, జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకోగా ఎన్‌ఓసీ లభించిందని అన్నారు. దీంతో వేరొకచోట ప్రభుత్వ భూమిలో శ్మశానవాటిక నిర్మాణం చేపట్టేందుకు అనుమతులు వచ్చాయని వివరించారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉందని అన్నారు. కావాలని వివాదం సృష్టించడంపై విలేకరుల దృష్టికి తీసుకువచ్చారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేక కుట్రలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చేస్తున్న అభివృద్ధిని, ఆయనకు ఉన్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ఇతర పార్టీల నాయకులు కుట్రలు పన్నుతున్నారని మున్సిపల్ చైర్మన్ నర్సిములు ఆరోపించారు. బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజకీయంగా ఎదుర్కొలేకనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. మంత్రి 2018 ఎన్నికల్లో చట్ట ప్రకారంగానే అఫిడవిట్ దాఖలు చేశారని వివరించారు. విషయంపై కొందరు అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని ఆరోపించారు. తప్పుడు మాటలు విని అదేవిధంగా మాట్లాడవద్దని హితవు పలికారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని పేర్కొన్నారు. అఫిడవిట్ అంశంలో కావాలని మంత్రిపై బురదజల్లే కార్యక్రమాన్ని ఒక ప్రణాళిక ప్రకారం జరుగుతుందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్ కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన క్లీన్‌చీట్‌ను దాచిపెట్టి మరోసారి కోర్టుకు వెళ్లారని ఆరోపించారు. ఒకటి జరిగితే మరోకటి ప్రచారం చేస్తూ తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ముడా చైర్మన్ వెంకన్న, మార్కెట్‌కమిటీ చైర్మన్ రహమాన్, శివరాజ, జావేద్‌బేగ్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వక్ఫ్ భూములను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆక్రమించాడని అబద్ధపు వ్యాఖ్యలు చేసిన రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని లేదంటే గాంధీభవన్ ముట్టడిస్తామని మహబూబ్‌నగర్ మైనార్టీ నేతలు హెచ్చరించారు. కాంగ్రెస్ పాలనలోనే వక్ఫ్ భూములు అన్యాక్రాంతం అయ్యాయని... తెలంగాణ ఏర్పడిన తర్వాత మంత్రి ఆధ్వర్యంలో వాటిని కాపాడారని వివరించారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. మహిళా మైనార్టీ నాయకురాళ్లు రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని అన్నారు. వక్ఫ్ కాంప్లెక్స్ చైర్మన్ మహమూద్, ఈద్గా కమిటీ చైర్మన్ తకి హుస్సేన్ తకీ, జామా మసీద్ చైర్మన్ అహ్మద్ అలీ సన, కౌన్సిలర్ మోసిన్, ఈద్గా కార్యదర్శి ఆఫీజ్ ఇద్రిస్, ఆర్టీఏ సభ్యుడు జావేద్ బేగ్, జహంగీర్ పీర్, ఐటీఐ ఉపాధ్యక్షుడు సల్మాన్ షరీఫ్, కలియుముద్దీన్ సిరాజ్, రిజ్వానా భాను, అమీనా భాను, మహీం సుల్తానా తదితరులు ఉన్నారు.

జుడిషియల్ అధికారం ఎందుకు కల్పించలేదు


మాట్లాడుతున్న ఫయాజ్

స్టేషన్ మహబూబ్‌నగర్: వక్ఫ్ బోర్డుకు జుడిషియల్ అధికారాలను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు కల్పించడం లేదని జిల్లా కాంగ్రెస్ మైనార్టీసెల్ అధ్యక్షుడు ఎండి.ఫయాజ్ ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి గురించి బీఆర్ఎస్ నేతలు ఇష్టానుసారంగా మాట్లాడడం సరికాదన్నారు. ముస్లింలు రోడ్డుపైకి వచ్చి జిల్లా కేంద్రం న్యూటౌన్‌లోని వక్ఫ్ భూములను కాపాడుకున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ ముస్లింలకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి నేర్చవేర్చలేదన్నారు. అసెంబ్లీ యువజన అధ్యక్షుడు జె.చంద్రశేఖర్ మాట్లాడుతూ గొర్రెల పథకమంటూ రాష్ట్ర ప్రభుత్వం కురుమ యాదవులను మోసం చేస్తున్నదని ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల వసతులు ఉన్నాయని అంటున్నారని, అలాంటప్పుడు ప్రజలు ప్రైవేట్‌కు ఎందుకు వెళుతున్నారని ప్రశ్నించారు. నాయకులు ఫక్రుద్దీన్ ఖురేషి, రమేశ్ నాయక్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.